

సైదాబాద్ ఉజాలా షా-ఈద్గా మైదానంలో ప్రసంగిస్తున్న మత పెద్దలు



నమాజ్‌లో పాల్గొన్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు



కొత్తగూడ: ప్రార్థనలో పాల్గొన్న మైనార్టీ నాయకులు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ప్రశాంతంగా ముగిసిన ప్రార్థనలు
- జంతువుల వ్యర్థాల తొలగింపులో జీహెచ్ఎంసీ సిబ్బంది
- నమాజ్‌కు ఈద్గాల వద్ద భారీ బందోబస్తు

మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న సైదాబాద్, మలక్‌పేట డివిజన్ల ఏసీపీలు సోమ వెంకట్ రెడ్డి, సుబ్బారామి రెడ్డి తదితరులు

సైదాబాద్/మాదన్నపేట/వనస్థలిపురం/కందుకూరు, జూన్ 7: మలక్‌పేట నియోజకవర్గంలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు సంప్రదాయ పద్ధతుల్లో ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్‌లు తెలుపుకున్నారు. మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లోని సైదాబాద్, అక్బర్‌బాగ్, అజంపురా, పాతమలక్‌పేట, మూసారాంబాగ్, ఐఎస్ సదన్, కుర్మగూడ డివిజన్ల పరిధిలోని ఉజ్జాలా-షా ఈద్గా, ఖుబ్బ మసీదు, ఖాద్రియా, జమా మసీదు, ఖాజాబాగ్, సలీంనగర్ ఈద్గా, మాదన్నపేట ఈద్గా, మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. సైదాబాద్ ఉజ్జాలా -షా ఈద్గాలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, మాదన్నపేట ఈద్గా యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా మజ్లిస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ప్రముఖులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

నమాజ్‌కు భారీ బందోబస్తు

సైదాబాద్ ఉజ్జాలా షా- ఈద్గా మైదానంలో జరిగిన నమాజ్‌ను పురస్కరించుకుని సైదాబాద్ డివిజన్ ఏసీపీ సోమ వెంకట్ రెడ్డి, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాలో నమాజ్ కార్యక్రమాన్ని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ తన కార్యాలయంలో బందోబస్తు చర్యలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు.

గూడూరులో ప్రార్థన చేస్తున్న బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు

కందుకూరు: ప్రార్థనలో చిన్నారులు



సైదాబాద్ ఉజాలా షా-ఈద్గా మైదానంలో నమాజ్‌కు హాజరైన ముస్లిం సోదరులు

- సైదాబాద్, మలక్‌పేట డివిజన్ల ఏసీపీలు సోమ వెంకట్ రెడ్డి, సుబ్బారామి రెడ్డి, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌లు ఎమ్మెల్యే బలాలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

వేగంగా జంతువుల వ్యర్థాల తొలగింపు

బక్రీద్ పండుగ సందర్భంగా మేకల, గొర్రెల, పొట్టేళ్ల జీవాల వ్యర్థాల తొలగింపు పనులను మలక్‌పేట సర్కిల్-6 ఏఎంహెచ్‌వో డాక్టర్ రుద్ర శ్రీనివాస్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసుల శాఖల సమన్వయంతో వ్యర్థాల తొలగింపును వేగంగా కొనసాగించారు. మలక్‌పేట సర్కిల్ పరిధిలో పారిశుధ్య కార్మికులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని వ్యర్థాలు వేయడానికి ముందుగానే ప్లాస్టిక్ బ్యాగ్‌లను అందజేయటంతో వ్యర్థాలు వేసినవా వాటిని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎత్తివేయడానికి శ్రమించారు. డస్ట్‌బిన్ల వద్ద పడవేసిన గడ్డి, చెత్తచెదారం, జంతువుల చర్మాల వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులు వెంట వెంటనే తొలగించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంలో అధికారులు, సిబ్బంది సక్సెస్ అయ్యారు.

మాదన్నపేట ఓల్డ్ ఈద్గాలో ..

మాదన్నపేట: మాదన్నపేట బక్రీద్ సందర్భంగా ఓల్డ్‌ఈద్గాలో ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. మాదన్నపేట, ఐఎస్‌సదన్ పోలీసులు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 10వేల ముస్లిం సోదరులు నమాజ్‌లో పాల్గొన్నారని పోలీస్ అధికారులు తెలిపారు.

కుల, మతాలకతీతంగా ఏకతాటిపై ఉండాలి

వనస్థలిపురం: కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని మాజీ రాజ్యసభ సభ్యుడు అజీజ్ పాషా అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని నందనవనం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మీర్పేట మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్, మహబూబ్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని కందుకూరు, కొత్తగూడ, బాచుపల్లి నేదునూరు, పులిమామిడి, ముచ్చర్ల, దాసర్లపల్లి దెబ్బడగూడ, బేగంపేట్, లేమూరు, గూడూరు, సరస్వతి గూడ,ఆగర్ మియగూడ, బైరాగిగూడ, గఫూర్‌నగర్ తదితర గ్రామాల్లో ఉదయం ముస్లింలు కొత్త బట్టలు కట్టుకొని ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్దకు వివిధ పార్టీల నాయకులు వెళ్లి ముస్లింలను కలుసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్, కొత్తగూడలో మైనార్టీ నాయకులు ఎండీ ఖదీర్, అంజద్,షరీఫ్, అజీజ్, ఎండీ దావూద్, య్యూం, సులేమాన్, గూడూరులో మండల మైనార్టీ సెల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎండీ అలీ, షరీఫ్ ఎండీ దావూద్ ఎండి అసిఫ్, అజ్జు,అరిఫ్ భాష, షకీల్, నిజాముద్దీన్, మున్వర్, కరీం బేగ్, పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం

మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లోని శ్రీగరుడ అభయ ఆంజనేయ స్వామి, లక్ష్మీగణపతి సహిత శ్రీభవానీ శంకర సహిత నవగ్రహ నాగదేవత దేవాలయంలో శనివారం మహాకుంభాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా పూజా గురు ప్రార్థన, వేద స్వస్తి, మంటప ఆవాహిత పూజలు, మన్యుసూక్త పారాయణం, 108సార్లు హవనం, సహస్ర కలశ వరుణపూజ (1008), తీర్థ ప్రసాద వితరణ తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ, టీసీఏటీ ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్, ఉపాధ్యక్షులు దుగ్గు జగదీశ్‌కుమార్, మాదారం కృష్ణ, సభ్యులు గంగా బాలాజీ, విశ్వం, తల్లం శ్రీకాంత్, అనిల్‌కుమార్, ఆంజనేయులు, సీహెచ్.అనంతరెడ్డి, నూక సంతోష్, గందే శ్రీధర్, ప్రమోద్, సురేశ్, మైల రవికాంత్, వెంకటేశ్, అజయ్‌కుమార్, బి.సురేందర్, రజనీకాంత్ పాల్గొన్నారు. – మలక్‌పేట, జూన్ 7

బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

మాదన్నపేట, జూన్ 7: చావుని ఉప్పర్‌బస్తీ రామాలయం ఎదురుగా శ్రీబంగారు మైసమ్మ దేవాలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తునట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనము తదితర కార్యకమాలు నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్టాపన అనంతరం అన్నప్రసాద కార్యకమం ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు బస్తీ బోనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్, జూన్ 7: సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్సీహచ్ జీఏ-1కాలనీ పద్మావతి కమ్యూనిటీహాల్ ఎదురుగా వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రూ.16లక్షల ప్రత్యేక నిధులతో కాలనీవాసుల కోరిక మేరకు ఈ రోడ్డును వేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.రామకృష్ణ, సెక్రటరీ ఏ. రమేశ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ బి.ఆనంద్, కమిటీ సభ్యులు జగన్, సుధీర్, ఆనంద్‌కుమార్, జీహెచ్ఎంసీ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ పాలక మండలి చైర్మన్‌గా ఈదులకంటి

చంపాపేట, జూన్ 7: కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మండలి నూతన చైర్మన్‌గా ఎన్నికైన ఈదులకంటి సత్యనారాయణ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, కార్యనిర్వహణ అధికారి లావణ్య ఆధ్వర్యంలో చైర్మన్ కార్యాలయంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈదులకంటి సత్యనారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మకర్తల సహకారంతో దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని, దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. దేవాలయం అభివృద్ధి కోసం సీఎంను ప్రత్యేకంగా కలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఎనుముల రవీందర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, దిండు ప్రవీణ్‌గౌడ్, దుర్గారెడ్డి, కె.కవిత, సంతోష్ కుమార్, బండి గారి శ్రీనివాస్ గౌడ్, ఓరుగంటి నరేశ్, విష్ణువర్ధన్ రెడ్డి, సింగంశెట్టి శ్రీనివాస్, పూల నాగరాజ్, తోకటి కిరణ్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు సత్యనారాయణ రెడ్డిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

యాదయ్య మృతి తీరని లోటు

కందుకూరు, జూన్ 7: మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గొర్రెంకల యాదయ్య మృతి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని అనంతరం గ్రామానికి చేరుకొని పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య అనురాధ, పిల్లలను ఓదార్చారు. ధైర్యం చెప్పారు. ఆయన అంత్యక్రియలు స్థానిక మాజీ సర్పంచ్ కాకి ఇందిరమ్మ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్, మార్కెట్ చైర్మన్ కృష్ణ నాయక్, మాజీ జెడ్పీటీసీలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేశ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాపురం లక్ష్మీనరసింహ రెడ్డి, మన్నే జయేందర్ ముదిరాజ్, యూత్ అధ్యక్షులు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, కాకి మధు, సత్తయ్య, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



యాదయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

విద్యార్థుల విరాళం

ఎల్బీనగర్ అనాథ విద్యార్థి గృహంలోని విద్యార్థులకు చైతన్యపురిలోని చైతన్య పాఠశాల 1988 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.63వేల విలువ గల టెక్స్ట్ బుక్స్, కంప్యూటర్ల హెడ్‌సెట్స్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారి గురువు సీతారాములు సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. 1988 బ్యాచ్ ప్రతినిధి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. గృహంలోని 120 మంది అనాథ, అణగారిన పిల్లలకు అద్భుత సౌకర్యాలు కల్పించి వారి చదువులకు, ఉజ్వల భవిష్యత్తుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహ కమిటీకి చేయూత నివ్వాలని సంకల్పంతో మా బ్యాచ్ ముందుకు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో వారి చదువులకు, వారి ఉద్యోగాలకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని, మరొక బ్యాచ్ ప్రతినిధి శ్రీ కృష్ణ పేర్కొన్నారు. అనంతరం గృహ విద్యార్థులు 120మందికి ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అనాథ విద్యార్థి గృహ అధ్యక్షులు మార్గం రాజేశ్, శంకర్, రాజేశ్వర్‌రెడ్డి, మారుతి ప్రసాద్, సతీశ్, సంధ్య, కల్పన, శ్రీదేవి, జ్యోతి, అనిత పాల్గొన్నారు. – ఆర్కేపురం, జూన్ 7

నాగోల్ పరిధిలో బాలుడి అదృశ్యం

మల్లేశ్(ఫైల్)

మన్సురాబాద్, జూన్ 7: ఆడుకుంటానంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, నువ్వులబండ కాలనీలో గొరిగే ఐలమ్మ తన కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. ఐలమ్మ రెండో తమ్ముడు ఆగమయ్య కొన్నాళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటినుంచి తమ్ముడి కొడుకు మల్లేశ్(11)ను ఐలమ్మ తన దగ్గరే ఉంచుకొని పెంచుకుంటుంది. మల్లేశ్ ప్రస్తుతం నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఐలమ్మ మనవరాలికి ఆరోగ్యంసరిగా లేకపోవడంతో ఈనెల 5న ఆమె దవాఖానకు వెళ్తూ మల్లేశ్‌ను భర్త దగ్గరే వదిలేసి వెళ్లింది. అదేరోజు ఉదయం 11గంటల సమయంలో ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన మల్లేశ్ తిరిగి రాలేదు. శనివారం ఇంటికి వచ్చిన ఐలమ్మకు భర్త విషయం తెలియజేశాడు. దీంతో బాలుడి ఆచూకీ కోసం ఆమె బంధువుల ఇండ్లలో వెతికినా జాడ తెలియరాలేదు. ఐలమ్మ ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తన భర్త నడవలేని కారణంగా ఫిర్యాదు చేయడం ఆలస్యమైందని ఐలమ్మ తన ఫిర్యాదులో పోలీసులకు తెలియజేసింది.

చర్లపల్లి చెరువులో డెవిల్ ఫిష్ దర్శనం

చర్లపల్లి చెరువు వద్ద డెవిల్ ఫిష్‌ను చూపిస్తున్న మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

చర్లపల్లి, జూన్ 7: మత్స్యకారులకు జీవనోపాధిగా మారిన చర్లపల్లి చెరువులో టన్నుల కొద్ది డెవిల్‌ఫిష్ దర్శనమివ్వడంతో మత్స్యకారులు ఆందోళన గురయ్యారు. మృగశిరకార్తె సందర్భంగా శనివారం చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులకు దయ్యం చేప లు టన్నుల కొద్ది వలలో పడడంతో వారు ఖంగుతిన్నారు. ఈ సందర్భంగా చర్లపల్లి మత్స్యకారుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈగ సత్యనారాయణ, విజయ్‌కమార్, ప్రతినిధి ఎంకిరాల నర్సింహులు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేప పిల్లలను అందజేయడంతో చెరువులో వదిలామని, దీంతో దయ్యం చేపల పిల్లలు రావడంతో టన్నుల కొద్ది చేపలు చెరువులో పెరిగాయన్నారు. అదేవిధంగా గత ఆరు నెలల కిందట చెరువులో మూడున్నర లక్షలతో చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులో వదిలామని, దెయ్యం చేపలు చెరువులో వేసిన చేప పిల్లలను తినడంతో చెరువు మొత్తం దెయ్యం చేపలతో నిండిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు చెరువును సందర్శించి తమను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం సీఐగా మహేశ్ గౌడ్

వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌గౌడ్‌ను శనివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరాజు గౌడ్, కొండ గిరిగౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో సత్కరించి పూలబొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘుమా రెడ్డి, శ్రవణ్ గౌడ్, శివాజీ యాదవ్, శ్రీశైలం యాదవ్, శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – మన్సురాబాద్, జూన్ 7

సీవీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ భవానీకి డాక్టరేట్

పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న భవాని

సిటీబ్యూరో, జూన్ 7(నమస్తే తెలంగాణ): సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ చిట్టిమల్ల భవానీకి జేఎన్‌టీయూ నుంచి పీహెచ్‌డీ గౌవర డాక్టరేట్ దక్కింది. నగరంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తూనే, డాక్టర్ గోవర్ధన్ పర్యవేక్షణలో 'సర్వికల్ క్యాన్సర్ ప్రెడెక్షన్ యూజింగ్ స్టాక్డ్ ఎన్సెంబుల్ క్లాసిఫైర్ విత్ నావెల్ జెనెటిక్ ఇన్ స్పైర్డ్ బైనరీ ఫైర్ ఫ్లై అల్గోరిథమ్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసింది. ఈ మేరకు జేఎన్‌టీయూలో జరిగిన 13వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్. టి. కిషన్‌కుమార్ రెడ్డి చేతులమీదుగా భవానీ గౌవర పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆర్కేపురం, జూన్ 7:మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధి సౌభాగ్యపురం కాలనీలోని శ్రీఅలివేలుమంగ పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం(కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో) చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. శనివారం సామాజిక సేవ వేత్త చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మధుర ఉపేందర్ రెడ్డిని మంత్రోచ్చారణతో దీవించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ రమణయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి మూర్తి, సౌభాగ్యపురం కాలనీ సెక్రటరీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వార్డు కార్యాలయం తొలగింపునకు నిరసనగా నేడు కీసరలో ధర్నా

కీసర, జూన్ 7: కీసరలోని వార్డు కార్యాలయాన్ని తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్న మున్సిపల్ అధికారుల పనితీరుకు నిరసనగా ఈనెల 8వ తేదీన ఉదయం 11గంటలకు కీసరలో పెద్ద ఎత్తున్న ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పలు పార్టీల నేతలు తెలిపారు.